మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక


పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ   ఎడిటర్ : నంద కిషోర్   సంపుటి : 08   సంచిక : 89   బుధవారం   10 - 09 - 2025   పేజీలు: 8   వెల: 4

## పదవులు కాదు..పార్టీ ముఖ్యం



8లో..

## భారత ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్



మన గళం, న్యూఢిల్లీ : భారత 17వ ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణ ఎన్నికయ్యారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి.. కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై విజయం సాధించారు. ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు వచ్చాయి. సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజారిటీతో గెలుపొం దారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలు మంగళవారం జరిగాయి. ఎన్నికల్లో మొత్తం 767 మంది ఎంపీలు ఓటు వేశారు. ఇందులో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఉన్నారు. ఎన్డీయే అభ్యర్థి అయిన సీపీ రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా.. కూటమి అభ్యర్థి అయిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు వచ్చాయి. 17 మంది ఎంపీలు గైర్హాజరవగా.. 15 ఓట్లు చెల్లకుండా పోయాయి. ఎలక్టోరల్ కాలేజీలో మొత్తం 781 మంది సభ్యులు ఉన్నారని రాజ్యసభ సెక్రటరీ తెలిపారు. ఎన్నికల్లో 767 మంది సభ్యులు ఓటు వేశారని.. 752 చెల్లుబాటు అయ్యాయని ఆయన తెలిపారు. విజయానికి 377 ఓట్లు అవసరమని వివరించారు. సీపీ రాధాకృష్ణన్ పూర్తి పేరు చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్. ఆయన 1957 అక్టోబర్ 20న తమిళనాడు తిరుప్పూర్‌లో సీకే పొన్నుసామి, కే జానకి దంపతులకు జన్మించారు. తూత్తుకుడిలోని వీఓ చిదంబరం కళాశాల నుంచి బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డిగ్రీ అందుకున్నారు. 1974లో ఆయన జనసంఘ్ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీకి ఎన్నికయ్యారు. 1980లో బీజేపీలో చేరారు.



### ఓటు హక్కు వినియోగించుకున్న

## ఎంపీ బైరెడ్డి శబరి

మనగళం, ప్రత్యేక ప్రతినిధి : పార్టమెంట్ లో మంగళవారం జరుగుతున్న ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యం మన దేశ బలానికి ప్రతీక అని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. అలాంటి ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామిగా ఉండడం గర్వంగా ఉందని ఎంపీ బైరెడ్డి శబరి చెప్పారు.



## అల్లకల్లోలంగా నేపాల్

### భారతీయులను అప్రమత్తం చేసిన కేంద్రం

మన గళం, న్యూఢిల్లీ : పొరుగు దేశమైన నేపాల్‌లో హింసాత్మక ఆందోళనలు తీవ్ర రూపం దాల్చాయి. నిరసనకారులు, పోలీసుల మధ్య జరిగిన ఘర్షణల్లో 19 మంది ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది గాయపడ్డారు. ఈ పరిణామాల నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. నేపాల్‌లో నివసిస్తున్న భారత పౌరులు అత్యంత జాగ్రత్తగా

2 లో..

## ఘన..సన్మానం



(మన గళం,కర్నూలు) : ఏ.పి.ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర కు అభినంద నలు వెల్లువెత్తుతు న్నాయి. ఇటీవల ఆయనను డైరెక్టర్ గా నియమి స్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసు కున్న విషయం పాఠకులకు విదిత మే. రాష్ట్రం నుంచి భాజపా తరపున డైరెక్టర్ గా నియమి తులైన ఏకైక వ్యక్తి ఆయనే కావడంతో తనను పలువురు బంధు, మిత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు అభినం దిస్తున్నారు. పుష్పగుచ్ఛాల నందజేసి, శాలువాలు కప్పి,ఘనంగా సత్కరిస్తు న్నారు. ఇదే క్రమంలో తాజాగా మంగళవారం నగరంలోని స్థానిక హీరా ఇన్ సర్వీస్ అపార్టె మెంట్స్ కార్యాలయంలోని తన ఛాంబర్లో ఆయ నను పలు జర్నలిస్టు సంఘాల నేతలు కలిసి, అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి, ఇలాంటి పదవులు మరెన్నోఅధి రోహించాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ నగరూరు రాఘవేంద్రను కలిసిన వారిలో అంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఇ.ఎన్.రాజు ,జాతీయ కౌన్సిల్ సభ్యులు జి.కొండప్ప, కె.నాగరాజు లున్నారు. అలాగే..ఆంధ్ర ప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్టక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.పూర్ణచంద్రా రావు డైరెక్టర్ నగరూరు రాఘవేంద్రను కలిశారు.

## ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఓటు వేసిన ఎంపీ బస్తిపాటి నాగరాజు




మనగళం, ప్రత్యేక ప్రతినిధి : ఉప రాష్ట్రపతి ఎన్నికలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఢిల్లీలోని పార్లమెంట్ నూతన భవనంలోని ఎఫ్-101 వసుధలో నిర్వహించిన ఎన్నికల పోలింగ్ లో ఆయన ఓటు వేశారు. జగదీశ్ ధన్ ఖడ్ రాజీనామతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి స్థానానికి నిర్వహించిన ఈ ఎన్నికలో, ఎన్డీఏ అభ్యర్తిగా మహారాష్ట్ర గవర్నర్ సీ.పీ రాధాకృష్ణన్ బరిలో ఉన్న విషయం తెలిసిందే. సాయంత్రం 5 గంటల వరకు పార్లమెంటు ఉభయ సభల సభ్యులు తమ ఓటు వేయనున్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన గంట తర్వాత సాయంత్రం 6 గంటలకు ఓట్ల లెక్కింపును అధికారులు చేపడతారు. లెక్కింపు ప్రక్రియ వేగంగా పూర్తి చేసి, ఈరోజు రాత్రికల్లా విజేతను ప్రకటించనున్నారు.

## బుద్ధి మార్చుకోని పాక్



- ప్రధాని మోదీకి, ఆర్మీ చీఫ్ కు మధ్య విభేదాలంటూ ఫేక్ ప్రచారం
- సోషల్ మీడియా వేదికగా భారత్‌పై విషం చిమ్ముతున్న దాయాది
- ఈ ప్రచారాన్ని ఖండించిన కేంద్ర ప్రభుత్వ పీఐబీ ఫ్యాక్ట్ చెక్

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మధ్య తీవ్రమైన విభేదాలు తలెత్తాయంటూ పాకిస్థాన్ ఆధారిత సోషల్ మీడియా ఖాతాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం తిప్పికొట్టింది. ఇది పూర్తిగా అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు పాకిస్థాన్ పన్నుతున్న కుట్రలో భాగమేనని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం

2 లో..

## చైర్మన్ ఎస్.రాజశేఖర్ శివప్రకాష్ కు ఘన స్వాగతం

మనగళం, కర్నూలు సిటీ :

ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్ రాజశేఖర్ శివప్రకాష్ కు ఆ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర ఘన స్వాగతం పలికారు. నన్నూరు టోల్ గేట్ వద్ద చైర్మన్ రాజశేఖర్ కు ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు నగరూరు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం రాయలసీమ యూని వర్సిటీ వద్ద చైర్మన్ రాజశేఖర్ కు డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర జ్ఞాపిక అందజేశారు. తదనంతరం జగన్నాథ గట్టులోని ట్రిపుల్ ఐటీ భవన నిర్మాణాలను వారు పరిశీలించారు. ట్రిపుల్ ఐటీ నిర్మాణాలకు సంబంధించిన వివరాలపై చైర్మన్ ఆరా తీశారు.









### హిమాచల్ వరద ప్రాంతాల్లో

## ప్రధాని ఏరియల్ సర్వే




### రూ.1500 కోట్ల ఆర్థిక సాయం ప్రకటన!

మన గళం, న్యూఢిల్లీ : గత కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ వంటి రాష్ట్రాలు అతలాకుతలం అయిపోయాయి. వరదలు బీభత్సానికి ఆయా రాష్ట్రాలు తీరని నష్టాన్ని చవిచూశాయి. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం, నిర్మాణాలు కూలిపోవడం కారణంగా చాలా వరకు ప్రాణనష్టం కూడా జరిగింది. ఈ నేపథ్యంలో మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఏరియల్ వ్యూ ద్వారా హెలికాప్టర్ వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఆ తర్వాత అక్కడి ప్రభుత్వం చేపట్టిన సహాయ, పునరావాస చర్యలను సమీక్షించడానికి, జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కాంగ్రాలో అధికారిక సమావేశం నిర్వహించారు.ఈ మేరకు వరద ప్రభావిత ప్రాంతాలకు రూ. 1500 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. అలాగే వరదల కారణంగా మృతి

2 లో..

## ఏపీకి యూరియా కేటాయించాలని విజ్ఞప్తి



మన గళం, అమరావతి : రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరతను నివారించేందుకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నేరుగా రంగంలోకి దిగారు. ఎరువుల సరఫరాపై సమీక్ష నిర్వహిస్తున్న సమయంలోనే కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు ఆయన ఫోన్ చేసి, తక్షణమే యూరియాను కేటాయించాలని కోరారు. కాకినాడ పోర్టుకు చేరుకోనున్న నౌక నుంచి ఆంధ్రప్రదేశ్‌కు అత్యవసరంగా యూరియా

2 లో..

## ఏపీలో 4 దశల్లో స్థానిక సంస్థల ఎన్నికలు

మన గళం, అమరావతి : ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు మ్మొద లైంది. ఇప్పటికే ప్రభు త్వానికి రాష్ట్ర ఎన్నికల సంఘం లేఖ రాసింది. తాజాగా మంగళవారం (సెప్టెంబర్ 9) ఏపీ స్టేట్




2 లో..

# అల్లకల్లోలంగా నేపాల్




ఉండాలని, స్థానిక అధికార యంత్రాంగం జారీ చేసే మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఈరోజు హెచ్చరించింది. నేపాల్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. "నిన్నటి నుంచి నేపాల్‌లో జరుగుతున్న ఘటనలు మమ్మల్ని తీవ్రంగా కలచివేశాయి. ఎంతో మంది యువకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. మృతుల కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాము" అని పేర్కొంది. స్నేహపూర్వక పొరుగు దేశంగా, సంబంధిత వర్గాలన్నీ సంయమనం పాటిస్తూ, శాంతియుత చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఆశిస్తున్నట్లు భారత్ తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నేపాల్ రాజధాని ఖాట్మండుతో పాటు పలు ప్రధాన నగరాల్లో అధికారులు కర్ఫ్యూ విధించారు. ఈ నేపథ్యంలో భారతీయులు ఎలాంటి సమూహాల్లో పాల్గొనవద్దని, అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని విదేశాంగ శాఖ సూచించింది. సోషల్ మీడియాపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని ఎత్తివేసిన మరుసటి రోజే... నిరసనలు మళ్లీ హింసాత్మకంగా మారడంతో అధికారులు ఖాట్మండు రింగ్ రోడ్ పరిధిలో నిరవధిక కర్ఫ్యూను అమలు చేస్తున్నారు. కర్ఫ్యూ సమయంలో నిరసనలు, సమావేశాలు, సభలపై పూర్తి నిషేధం విధించినట్లు ఖాట్మండు జిల్లా అధికారి ఛబిలాల్ రిజాల్ వెల్లడించారు. ప్రభుత్వం అవినీతిని అరికట్టడంలో, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైందంటూ "జెన్" యువత పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తోంది. దీనికి తోడు ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికలపై ప్రభుత్వం నిషేధం విధించడం వారి ఆగ్రహానికి మరింత ఆజ్యం పోసింది.

# బుద్ధి మార్చుకోని పాక్

చేసింది. పాకిస్థాన్‌తో వివాదం పెట్టుకోవడానికి భారత సైన్యం సిద్ధంగా లేదని, సైనిక సామగ్రిని ఆధునికీకరించకుండా ప్రభుత్వం ఒత్తిడి తేవడంపై సైన్యాధికారులు అసంతృప్తితో ఉన్నారంటూ కొన్ని 'ఎక్స్' ఖాతాల నుంచి ఒకే తరహా సందేశాలు విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. ఈ పోస్టులన్నీ పాకిస్థాన్ నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నాయని గుర్తించిన పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ వెంటనే రంగంలోకి దిగింది. భారత ప్రభుత్వం, సైన్యం మధ్య ఐక్యతను దెబ్బతీసే ఉద్దేశంతోనే ఈ కల్పిత ప్రచారానికి తెరలేపారని తేల్చిచెప్పింది. గతంలో 'ఆపరేషన్ సిందూర్' సమయంలో కూడా పాకిస్థాన్ ఇలాంటి అసత్య ప్రచారాలకే పాల్పడిందని, ఇప్పుడు కూడా అదే పంథాను కొనసాగిస్తోందని పీఐబీ గుర్తు చేసింది. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న ఇలాంటి నిరాధారమైన సమాచారాన్ని నమ్మవద్దని, ఏదైనా వార్తను నిర్ధారించుకోవడానికి అధికారిక మాధ్యమాలను ఆశ్రయించాలని ప్రజలకు సూచించింది. దేశ భద్రతకు సంబంధించిన విషయాల్లో ప్రజల్లో గందరగోళం సృష్టించే ఇలాంటి ప్రయత్నాల పట్ల పౌరులందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# హిమాచల్ వరద ప్రాంతాల్లో ప్రధాని మోదీ ఏరియల్ సర్వే

చెందిన కుటుంబాలను ప్రధాని నరేంద్ర మోదీ పరామర్శించారు. బాధిత కుటుంబాలను తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే బాధిత కుటుంబాలకు రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం అందించనున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ ప్రాంతాన్ని, ప్రజలను తిరిగి తమ కాళ్లపై నిలబెట్టడానికి బహుముఖ దృక్పథాన్ని తీసుకోవాలని ప్రధానమంత్రి కోరారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లను పునర్నిర్మించడం, జాతీయ రహదారుల పునరుద్ధరించడం, పాఠశాలలను పునర్నిర్మించడం, పశువులకు మినీ కిట్లను విడుదల చేయడం వంటి అనేక మార్గాల ద్వారా వీటిని పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయ సమాజానికి మద్దతు ఇవ్వవలసిన కీలకమైన అవసరాన్ని గుర్తించి, ప్రస్తుతం విద్యుత్ కనెక్షన్లు లేని రైతులకు అదనపు సహాయం అందించాలని ఆయన సూచించారు. రాష్ట్రాలకు ముందస్తు చెల్లింపులు సహా విపత్తు నిర్వహణ నియమాల కింద అన్ని సహాయాలను అందిస్తున్నామని ప్రధానమంత్రి పేర్కొన్నారు. వరదల సమయంలో సహాయక చర్యలను చేపట్టిన, సైన్యం, రాష్ట్ర పరిపాలన, ఇతర సేవా ఆధారిత సంస్థల సిబ్బంది కృషిని ఆయన ప్రశంసించారు. రాష్ట్రం మెమోరాండం, కేంద్ర బృందాల నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం అంచనాను మరింత సమీక్షిస్తుందని ఆయన పేర్కొన్నారు.



# ఏపీకి యూరియా కేటాయించాలని విజ్ఞప్తి

కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తికి కేంద్రమంత్రి నడ్డా వెంటనే సానుకూలంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌కు తక్షణమే 17,293 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి చొరవతో కేంద్రం నుంచి కేటాయింపులు జరగడంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను అప్రమత్తం చేశారు. కేటాయించిన యూరియాను యుద్ధప్రాతిపదికన అవసరమైన జిల్లాలకు తరలించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. యూరియాను ఎవరైనా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 80,503 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా కేంద్రమంత్రితో మాట్లాడటం వల్లే ఈ కేటాయింపు సాధ్యమైందని తెలిపారు. రాబోయే రబీ సీజన్‌కు కూడా రాష్ట్రానికి అవసరమైన 9.3 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను కేంద్రం కేటాయించిందని, కాబట్టి రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు ధైర్యం చెప్పాలని వ్యవసాయ అధికారులకు ఆయన సూచించారు.

# ఏపీలో 4 దశల్లో స్థానిక సంస్థల ఎన్నికలు

ఎలక్షన్ కమిషన్‌లో ఎస్‌ఈసీ కీలక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల సెక్రెటరీలతో నీలం సాహ్ని భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికలు, కొత్త ఈవీఎంల కొనుగోలుపై విస్తృతంగా చర్చించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు దశల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగాయని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని ప్రకటించారు. అయితే ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు సీఈవో తెలిపారు. ఇటీవల మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ స్థానిక ఎన్నికల్లో ఈవీఎం మిషన్లను వాడారని ఆమె గుర్తు చేశారు. ఇక ఈవీఎంల కొనుగోలు, వినియోగంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల కమిషనర్ వెల్లడించారు. ఏపీలో ముందస్తుగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించే యోచనలో ఎన్నికల సంఘం ఉన్నట్లు తెలుస్తోంది. 2026 జనవరిలోనే ఎన్నికలు నిర్వహించాలనే ప్లాన్ చేస్తోంది. ఈ మేరకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది రాష్ట్ర ఎన్నికల సంఘం. స్థానిక సంస్థల ఎన్నికలను 4దశల్లో నిర్వహించేందుకు సిద్దంగా ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ ప్రకటించారు. గ్రామ పంచాయతీలలో 1,37,671 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఎన్నికల కోసం 41,301 కంట్రోల్ యూనిట్లు, 82,602 బ్యాలెట్ యూనిట్లు అవసరం అవుతాయి. ఒక కంట్రోల్ యూనిట్‌కు రెండు బ్యాలెట్




యూనిట్లు అనుసంధానం చేయవచ్చు అని ఎస్‌ఈసీ నీలం సాహ్నీ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ ప్రకటించారు.

# ఏపీ, తెలంగాణలో ఐదు రోజులపాటు కుండపోత వర్షాలు

- రేపటి నుంచి 15 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు
- వర్షాలతో పాటు బలమైన ఈదురుగాలుల హెచ్చరిక
- తెలంగాణలోని పలు జిల్లాల్లో ఇప్పటికే మోస్తరు వర్షాలు
- వరంగల్‌లో అత్యధికంగా 5.92 సెం.మీ. వర్షపాతం నమోదు

మన గళం, అమరావతి : తెలుగు రాష్ట్రాల ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం కీలక హెచ్చరిక జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం కారణంగా రానున్న ఐదు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటన ప్రకారం 13వ తేదీన బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఈ వాతావరణ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల వైపుగా కదిలే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో రేపటి నుంచి 15వ తేదీ వరకు తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. కొన్ని చోట్ల కుండపోత వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని, వర్షాలతో పాటు బలమైన ఈదురుగాలులు కూడా వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇక తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈ నెల 14వ తేదీ వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు



కురుస్తాయని వివరించింది. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ సహా పలు జిల్లాల్లో ఈ వర్షాలు నమోదవుతాయని పేర్కొంది. గడిచిన 24 గంటల వ్యవధిలో ఇప్పటికే వరంగల్, హనుమకొండ, ములుగు జిల్లాల్లో మోస్తరు వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. వరంగల్‌లో అత్యధికంగా 5.92 సెంటీమీటర్ల వర్షం కురవగా, ఖిల్లా వరంగల్‌లో 5.57 సెం.మీ., గీసుకొండలో 4.50 సెం.మీ. వర్షపాతం రికార్డయింది.

# ఏపీకి మరో 50 వేల టన్నుల యూరియా

- వైసీపీ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు - వైసీపీ హయాంలోనే రైతులు యూరియా కోసం నానా అవస్థలు పడ్డారు

మన గళం, అమరావతి : కూటమి ప్రభుత్వం యూరియా సరఫరా చేయకుండా రైతులను ముప్పుతిప్పలు పెడుతోందని వైసీపీ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. సొంత మీడియా, సోషల్ మీడియాల్లో విస్తృతంగా కథనాలు వండివారుస్తుండటంతో.. ఏపీ వ్యవసాయశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు ఈ వార్తలపై స్పందించారు. మీడియా సమావేశం మాట్లాడుతూ.. వైసీపీ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని కొట్టిపడేశారు. వైసీపీ హయాంలోనే రైతులు యూరియా కోసం నానా అవస్థలు పడ్డారని.. కూటమి ప్రభుత్వం ముందుగానే యూరియా సరఫరా చేసి కొరతకు తెరదించిందని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు చొరవ చూపి కేంద్ర మంత్రి నడ్డాతో మాట్లాడటం వల్ల మరో రెండు రోజుల్లో రాష్ట్రానికి అదనంగా 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా రానుందని పేర్కొన్నారు. యూరియా కొరతపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా యూరియా సమస్య లేదని.. వైసీపీ కావాలని రాజకీయం చేస్తోందని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచుతున్నామని అన్నారు. రబీకి కేంద్రం 9.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం130 కోట్లు ఖర్చు చేసి 7.37 లక్షల మంది రైతులకు విత్తనాలు రాయితీతో అందించిందని పేర్కొన్నారు. వైసీపీనే ఉచిత పంటల బీమా పేరుతో అన్నదాతలను దగా చేసిందని.. మా ప్రభుత్వం రైతులకు సమయానికి పరిహారం అందిస్తోందని



అన్నారు. క్వింటా ఉల్లికి గత వైసీపీ సర్కార్ కేవలం రూ.770 మాత్రమే ఇస్తే.. కూటమి ప్రభుత్వం రూ.1200 మద్దతు ధర ప్రకటించడమే గాక.. అదే ధరకు కొనుగోలు చేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50 ల సబ్సిడీ రేటుతో విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. డ్రిప్ ఇరిగేషన్, ఆయిల్ పామ్ సాగులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం దేశంలోనే నంబర్ వన్‌గా మార్చగలిగినందుకు గర్వంగా ఉందన్నారు. టొమాటో, మామిడి, మిర్చి, కోకో, పొగాకు ధరలు పడిపోతే కూటమి ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందని గుర్తుచేశారు. పశుబీమా పరిహారం కూడా రూ.37,500 నుంచి రూ.50,000 కి పెంచి రైతులపై భారాన్ని తగ్గించామని అన్నారు. మత్స్యకారుల భృతి సైతం రూ.10,000 నుండి రూ.20,000లకు పెంచి 1.21 లక్షల కుటుంబాలకు 242.8 కోట్లు చెల్లించామని వెల్లడించారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## అంగన్వాడీ వర్కర్ల వేతనాలు పెంచాలి



మనగళం, కర్నూలు సిటీ : అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్, మినివర్కర్స్ కు తక్షణమే వేతనాలు పెంచాల డిమాండ్ చేస్తూ మంగళవారం మంత్రి టీజీ భరత్ కు ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలిత, జిల్లా ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి లలిత అంగన్వాడీ వర్కర్ల సమస్యలను వివరించారు. రోజురోజుకు పని భారం పెంచుతున్నారే తప్పా గత12 సంవత్సరాల నుండి గౌరవ వేతనాలు పెంచలేదన్నారు. అంగన్వాడీ వర్కర్లను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని నాయకులు మంత్రిని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మునెప్ప, సిటీ సెక్రటరీ చంద్రశేఖర్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి. చౌడేశ్వరి, జిల్లా కౌన్సిల్ సభ్యులు మంజుల, పార్వతి, రత్నమ్మ లు పాల్గొన్నారు.

## ఉల్లి రైతులకు మద్దతు ధర చెల్లించేందుకు రూ.10 కోట్లు మంజూరు

**- ఉల్లి కొనుగోళ్ల ప్రక్రియను ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలి**
**- ప్రతి రోజూ 500 మెట్రిక్ టన్నులు ఇతర ప్రాంతాల మార్కెట్ లకు తరలించేలా చర్యలు తీసుకోవాలి**
**- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

మనగళం, కర్నూలు సిటీ : ఖరీఫ్ లో పండించిన ఉల్లి రైతులకు రూ.1200 మద్దతు ధర చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. మంగళవారం ఉల్లి కొనుగోళ్ల అంశానికి సంబంధించి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కొనుగోళ్ల కమిటీ సమావేశాన్ని టెలి కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లి కొనుగోళ్ల ప్రక్రియను ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతుల నుండి ఆధార్, బ్యాంకు అకౌంట్ తదితర వివరాలను తీసుకుని, ఎక్కడా పొరపాట్లు లేకుండా ఉల్లి కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అర్లీ ఖరీఫ్ లో పండించిన ఉల్లి పంటను మద్దతు ధర రూ.1200 లతో కొనుగోలు కోసం ప్రభుత్వం రూ. 10 కోట్లు మంజూరు చేసినందున, వ్యత్యాసపు ధర ను రైతులకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతులకు సెప్టెంబర్ 20 వ తేదీ దాకా ఎర్లీ ఖరీఫ్ పంట వచ్చే అవకాశం ఉందని హార్టికల్చర్ అధికారులు కలెక్టర్ కు వివరించారు. మార్కెట్ యార్డ్ కు వచ్చే ఉల్లి ఫీల్డ్ నుంచి వస్తోందా లేక ఏమైనా రీసైక్లింగ్ జరుగుతోందా అని పరిశీలించేందుకు 5 మంది హార్టికల్చర్ అధికారులను మార్కెట్ యార్డ్ లో విధులు నిర్వర్తించేలా నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. ఉల్లి పంట తీసుకువచ్చే వాహనాలు ట్రాఫిక్ జాం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మార్కెట్ యార్డ్ సెక్రెటరీ ని ఆదేశించారు. నంద్యాల, కడప జిల్లాల హోల్ సేల్ మార్కెట్ లకు తరలించేందుకు వీలుగా ఆయా జిల్లాల కలెక్టర్లతో మాట్లాడతానని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా జిల్లాలో ఉల్లి పంట పండించని మండలాల్లో ఎఫ్ పి షాపులకు తరలించేందుకు కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య మాట్లాడుతూ ఈ రోజు 200 టన్నులు తాడేపల్లిగూడెంకు, 200 టన్నులు హైదరాబాదుకు, రైతు బజార్ కు 80 టన్నులు పంపుతున్నామని వివరించారు. టెలి కాన్ఫరెన్స్ లో మార్కెటింగ్ శాఖ జెడి రామాంజనేయులు, మార్కెటింగ్ ఏడీ నారాయణ మూర్తి, మార్క్ ఫెడ్ డీఎం రాజు, జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, మార్కెట్ యార్డ్ సెక్రెటరీ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## 15న ఖేల్ ఇండియా సెంటర్ హ్యాండ్ బాల్ పోటీలు

మనగళం, కర్నూలు సిటీ : ఖేల్ ఇండియా సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 15 వ తేదీన అవుట్ డోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు సెంటర్ ఇంచార్జ్ కార్తికేయన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 2008 నుంచి 2013 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. గోల్ కీపర్ ఎత్తు 175 సెంటీమీటర్లు ఉండాలని, లెఫ్ట్ అండ్ క్రీడాకారులు కూడా 175 సెంటీమీటర్లు ఉన్నవారే అర్హులని ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డుతో పాటు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, పదోతరగతి మార్క్ లిస్ట్ తీసుకురావాలని సూచించారు. ఉదయం 7 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు.

## వృద్ధురాలి హత్య కేసును చేధించిన పోలీసులు

మనగళం, కర్నూలు క్రైం : కర్నూలు లో ఈనెల 1 వ తేదీ జరిగిన గణేష్ నగర్ కు చెందిన కాటసాని శిలలీల (75) హత్య కేసును కర్నూలు త్రీ టౌన్ పోలీసులు చేధించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, కర్నూలు డీఎస్పీ జె. బాబు ప్రసాద్, కర్నూలు త్రీ టౌన్ సీఐ శేషయ్య, కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడుతో కలిసి జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో నిందితురాలి వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇంట్లో పని మనిషి కురువ వరలక్ష్మి (49) హత్య చేసి శివలీల ఒంటి పై ఉన్న బంగారు ఆభరణాలు తీసుకుని వెళ్లినట్లు తెలిపారు. మెయిన్ రోడ్డు లో ఉన్న సీసీ టీవీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితురాలిని గుర్తించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లాలో 5 వేల సిసి కెమెరాలను ఇటీవల కాలంలో ఏర్పాటు చేశామన్నారు. కర్నూలు పట్టణంలోనే 2 వేల సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. నిందితురాలి వేలిముద్రలు ఘటన జరిగిన ప్రాంతంలో గుర్తించామన్నారు. శివలీలను రోకలి బండతో తలపై కొట్టి హత్య చేసిందన్నారు. ముద్దాయి పని మనిషి కురువ వరలక్ష్మి నుంచి సుమారు ఆరు తులముల బంగారు చైన్, 11 తులాల బంగారు ఆభరణాలు, బ్యాంకు పాసు పుస్తకాలు, చెక్ బుక్ లు, హత్య కు ఉపయోగించిన రొకలి బండను స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరితగతిన చేధించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించి రివార్డులు అందజేశారు. అదేవిధంగా హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాసులు, శేఖర్ బాబు, ప్రతాప్ కుమార్, కానిస్టేబుల్స్ నాగరాజు, చంద్రబాబునాయుడు, పరమేశ్వరుడు, సమీర్, రాముడు, వీరబాబు, హోంగార్డు ఇబ్రహీంలను జిల్లా ఎస్పీ అభినందించారు




## 10వ తేదీన డయల్ యువర్ ఎస్ఈ

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కొరకు స్థానిక విద్యుత్ భవన్ లో ఈ నెల 10వ తేదీన డయల్ యువర్ ఎస్ఈ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10:00 గంటల నుంచి 11:00 గంటల వరకు ఈ ప్రోగ్రాం ఉంటుందని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా లో అంతరాయం, లో ఓల్టేజీ, విద్యుత్ సిబ్బంది అందుబాటు తదితర సమస్యలను 7382614308 నంబర్ కు తెలిపి పరిష్కరించుకోవాలని సూచించారు.

## ఎన్జీఓలు అనుసంధాన కర్తలుగా పనిచేయాలి

మనగళం, కర్నూలు సిటీ : పేదలకు... సంబంధిత శాఖలకు మధ్య అనుసంధానకర్తగా ఎన్జీఓలు పనిచేయాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బి.లీల వెంకట శేషాద్రి సూచించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాలు, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. కబర్ధి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బి.లీల వెంకట శేషాద్రి మంగళవారం కర్నూలు న్యాయ సేవా సదన్ నందు ఉమ్మడి జిల్లాల ఎన్జీఓలు, ఎడ్యుకేషన్, చైల్డ్ వెల్ఫేర్, డిజబులిటీ, పోలీస్ డిపార్ట్మెంట్ ప్రతినిధులకు సెన్సిటైజషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, పిల్లలు, సీనియర్ సిటిజన్స్, అక్రమ రవాణా బాధితులు, ట్రాంజెండర్స్, గిరిజనలు, అసంఘటిత కార్మికులు తదితరుల ప్రయోజనాల కోసం పనిచేసే ఎన్జీఓలు, గవర్నమెంట్ డిపార్ట్మెంట్లను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలన్న ఉద్దేశంతో ఈ సెన్సిటైజేషన్ ప్రోగ్రాంను లీగల్ సర్వీసెస్ ఏర్పాటు చేసిందన్నారు. న్యాయ సేవల సంఘం, ఎన్జీఓల సమష్టి ప్రయత్నంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హత ఉన్న పేదవారికి చేరవేసి ప్రయోజనం కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సీనియర్ సిటిజన్ డిపార్ట్మెంట్ అడిషనల్ డైరెక్టర్ రైస్ ఫాతిమా మాట్లాడుతూ తమ డిపార్ట్మెంట్ ద్వారా సీనియర్ సిటిజనులకు, ట్రాంజెండర్లకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. నంద్యాల డిస్టిక్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ పేద పిల్లలను గుర్తించి స్కూళ్లలో చేర్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాల మండల విద్యాశాఖ అధికారులు, కర్నూలు చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, నేస్తం ఎన్జీవో సుధారాణి, సీఎంఎస్ ఎన్జీవో అంబికా, శిశు కేంద్రం ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు, ఎన్జీవో బచ్పన్ బచావో ఆందోళన్ ప్రతినిధి మౌనిక, ప్రతిభా ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధి నారాయణ తదితరులు పాల్గొన్నారు.




## కేఎంసీ ఎంబీబీఎస్ విద్యార్థులకు మెడల్స్




మనగళం, ప్రత్యేక ప్రతినిధి : ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గవర్నర్, యూనివర్శిటీ ఛాన్సలర్ అబ్దుల్ నజీర్ అధ్యక్షతన 27, 28 వార్షిక స్థాతకోత్సవం నిర్వహించారు. కర్నూల్ మెడికల్ కాలేజీ కి చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో వైస్ ఛాన్స్ లర్ డా. చంద్ర శేఖర్, ముఖ్య అతిథి నేషనల్ హార్ట్ ఇన్స్టిట్యూషన్ న్యూఢిల్లీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర , చీఫ్ కార్డియాలజిస్ట్ డా ఓపీ యాదవ్ చేతుల మీదగా మెడల్స్, సర్టిఫికేషన్ అందుకున్నారు. 2023 ఎంబీబీఎస్ చివరి సంవత్సరం పరీక్షల్లో డా. పెరిగెళ్ళ నమ్రత, డా.కావూరి హైమావతి, డా.కావూరి చలపతి రావ్ రాష్ట్ర స్థాయి లో ప్రతిభ కనపరిచి మెడల్స్ సాధించారు. డా. నమ్రత కేఎంసీ వైస్ ప్రిన్సిపల్, జనరల్ సర్జరీ విభాగాధిపథి డా.హరి చరణ్, ఆఫ్థల్మాలజి ప్రొఫెసర్ డా.నివేదిత దంపతుల కుమార్తె. తను ప్రస్తుతం ఏయిమ్స్ న్యూఢిల్లీ యందు యండీ పీడీ యాట్రిక్ చదువుతున్నది. కర్నూల్ మెడికల్ కాలేజీ ఫైనల్ ఎంబీబీఎస్ విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభ కనబరిచి మెడల్స్ అందుకోవడంపై అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ , కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా. చిట్టి నరసమ్మ హర్షం వ్యక్తం చేశారు.

## స్త్రీలకు సమాన అవకాశాలు కల్పించాలి



మనగళం, కర్నూలు సిటీ : స్త్రీలకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు డిమాండ్ చేశారు. కర్నూలు నగర పరిధిలోని శరీన్ నగర్ 31 32 వార్డుల మహిళా సంఘం ( ఐద్వా) సభ్యుల సమావేశం మంగళవారం నగర నాయకురాలు ఉమా అధ్యక్షతన నాగుల కట్ట వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా అలివేలు మాట్లాడుతూ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, రంగాలలో స్త్రీలకు సమాన అవకాశాలు కల్పించిన దేశాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. 77 ఏళ్ల స్వాతంత్ర కాలంలో కేంద్రం, రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారుతున్నా, మహిళల జీవితాలలో మార్పులు రాలేదన్నారు. నేటికి సమాజంలో మహిళలకు భద్రత లేదన్నారు. అత్యాచారాలు, అసమానతలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు అంటూ హామీలు గుప్పించి నేడు సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. ఉచిత బస్సు ప్రయాణంలో నాన్ స్టాప్ బస్సులలో, అవకాశం కల్పించకపోవడం, విజయవాడ, వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే సుమారుగా మూడు బస్ స్టేషన్లలో దిగి ప్రయాణం చేయడం మహిళలకు సౌకర్య వంతంగా లేదని తెలిపారు. మహిళలకు సూపర్ లగ్జరీ బస్సులలో కూడా ప్రయాణించడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా ప్రగతికి ఎంతో ఉపయోగపడిన పొదుపు రుణాలకు సున్నా వడ్డీ పథకం అమలు చేయకపోవడం, శ్రీనిధి పథకంలో మహిళలు కట్టిన డబ్బులకు వడ్డీ ఇవ్వకపోగా తమ డబ్బులు తమకు వాపసు ఇవ్వాలని కోరు తున్నా పట్టించుకోకపోవడం లేదని వాపోయారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

**– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

మనగళం, కర్నూలు సిటీ: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని, రోగుల నుండి డబ్బు వసూలు చేస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆసుపత్రి యాజమాన్యాలను హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్టీఆర్ వైద్య సేవకు సంబంధించి ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు ఉచితంగా వైద్యం అందించే పథకమని, రోగుల నుండి డబ్బు తీసుకోవడం సముచితం కాదన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని, కమర్షియల్ పద్ధతిలో ఆలోచన చేయకూడదని సూచించారు. ఆసుపత్రికి ఎవరైనా రోగులు వచ్చినప్పుడు వారు ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కార్డు మర్చిపోయిన ఎడల వారిని ముందుగా ఎన్రోల్ చేసి ఉచితంగా ఓపి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆసుపత్రి యాజమాన్యాలు రోగుల నుండి డబ్బు తీసుకుంటున్నట్లు ఐవీఆర్ఎస్ ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయ సేకరణలో తేలిందన్నారు. నగరంలోని అమీలియో, ఏం ఎస్ ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, స్టార్ కేర్, ఒమేగా ఆసుపత్రులలో ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగుల నుండి డబ్బులు తీసుకుంటున్నట్లు ప్రజల నుండి ఫిర్యాదులు అందాయన్నారు. ఏం ఎస్ ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వారు సమావేశానికి హాజరు కానందున నోటీస్ ఇవ్వాలని



కలెక్టర్ ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ ను ఆదేశించారు. ఆసుపత్రులకు ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వం నుండి పెండింగ్ లో ఉన్న బకాయిలకు సంబంధించి డీఓ లెటర్ సిద్ధం చేయాలని కలెక్టర్ ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ ను ఆదేశించారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ డా.ఎంవిఎన్ఎస్వీ భాస్కర్ రెడ్డి, ఇంచార్జి డీఎం హెచ్ ఓ డా.లలిత దేవి, డిసిహెచ్ఎస్ డా.జఫ్రుల్లా , ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు పాల్గొన్నారు.

# కూటమి సర్కార్ కు వ్యతిరేకంగా భారీ నిరసన ర్యాలీ






మనగళం, కర్నూలు సిటీ : వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు మంగళవారం ఆ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా నగరంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి రైతులు, పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. ఎస్వీ ఆధ్వర్యంలో కర్నూలు చిల్డ్రన్ పార్క్ నుండి పెద్ద ఎత్తున రైతులతో కలిసి ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. కూటమి సర్కార్ కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. రైతుకు న్యాయం చేయాలని... గిట్టుబాటు ధర కల్పించాలని... యూరియా బ్లాక్ మార్కెట్ కు తరలింపును అరికట్టాలన్న నినాదాలు హోరెత్తాయి. రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవో కు వినతిపత్రం అందజేయడం జరిగింది. కార్యక్రమంలో వైసీపీ నేతలు గంగుల ప్రభాకర్ రెడ్డి, స్టేట్ మహిళ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి, కోట్ల హర్షా వర్ధన్ రెడ్డి, అదిమలపు సతీష్, మేయర్ రామయ్య, అహ్మద్ అలీ ఖాన్, కార్పొరేటర్లు, అనుబంధ విభాగం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


# ఆరబెట్టి, గ్రేడింగ్ చేసిన ఉల్లిని తీసుకురండి

**– మార్కెట్ యార్డుకు తెచ్చిన ఉల్లి తప్పకుండా కిలో రూ. 12 రూపాయల చొప్పున కొంటాం**

**– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

మనగళం, కర్నూలు సిటీ : రైతులు ఉల్లిని ఆరబెట్టి, గ్రేడింగ్ చేసుకొని మార్కెట్ యార్డుకు తీసుకు రావాలని, మార్కెట్ యార్డ్ కు తెచ్చిన మొత్తం ఉల్లి కొనడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా రైతులకు తెలియజేశారు. మంగళవారం సాయంకాలం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా కర్నూలు మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా పోలకల్ గ్రామం సి.బెళగల్ మండలం కు చెందిన తెలుగు వెంకట లక్ష్మమ్మ , సంఘాల గ్రామం , బెలగల్ మండలం నాయుడు , సనగండ్ల గ్రామం గూడూరు మండలం కు చెందిన భరత్ కుమార్ రెడ్డి తెచ్చిన ఉల్లి ఉత్పత్తులను పరిశీలించారు. వీరితో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...బాగుగా ఆరబెట్టిన, గ్రేడింగ్ చేసిన ఉల్లిని మార్కెట్ యార్డుకు తీసుకుని రావలసిందిగా మీ గ్రామాల్లో మీరు రైతులకు చెప్పాలని సూచించార. తొందరపడి పచ్చిగా ఉన్న ఉల్లి తీసుకురావద్దని వారికి తెలియజేశారు. కర్నూలు జిల్లాలో పండించే ఉల్లికి మంచి పేరు ఉన్నదని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత , అవసరం ఉన్నదని వారికి తెలియజేశారు. పచ్చిగా ఉన్న , గ్రేడింగ్ చేయని ఉల్లి దూర ప్రాంతాలకు వెళ్లే లోపల చెడిపోతుందని తెలిపారు. ఈ విధంగా పంపడం వలన మన కర్నూలు ఉల్లికి చెడ్డ పేరు వస్తుందని తెలిపారు. గత సంవత్సరం దాదాపు దేశమంతా మన ఉల్లి అమ్మకం చేసామని తెలిపారు. ప్రస్తుతం మహారాష్ట్ర, మన పొరుగు దేశమైన బంగ్లాదేశ్ లలో ఉల్లి పంట బాగా పండటం వలన మన ఉల్లికి మంచి రేటు రావడం లేదన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం 12 రూపాయలు కేజీ చొప్పున కొంటూ ఉన్నదని తెలిపారు. ఈ సందర్భంగా మహారాష్ట్రలో పండించే ఉల్లిని ప్రయోగాత్మకంగా కర్నూలు జిల్లాలో రైతులు పండించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా హార్టికల్చర్ అధికారిని ఆదేశించారు. మార్కెట్ యార్డ్ సెక్రటరీ జయలక్ష్మి మాట్లాడుతూ మార్కెటింగ్ ఫెడరేషన్ శాఖ ఈ రోజు వచ్చిన ఉల్లి మొత్తం కొనడం మరియు రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు తరలించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశాల మేరకు రైతులకు సబ్సిడీ ధరతో మధ్యాహ్న భోజనము 15 రూపాయలకు, రాత్రి భోజనము 10 రూపాయలకు అందించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు.

# నందీశ్వరస్వామికి విశేషపూజ



మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (09.09.2025) ఆలయప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది. ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీ సేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయంసంధ్యాసమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకుమహాగణపతిపూజను జరిపించబడుతుంది. తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది. చివరగా స్వామికి నివేదన సమర్పించబడుతుంది.

# శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం

మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (09.09,2025) ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానం సేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన



పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

# సాంస్కృతిక కార్యక్రమాలు

మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (09.09.2025%రి% శ్రీ భవానీ విజయ్ మరియు వారి సంప్రదాయనృత్యం కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ భరతనాట్యం కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో శ్రీ విఘ్నరాజం, గణేశకౌత్వం, శ్రీచక్రరాజ, అర్ధనారీశ్వరం, లింగాష్టకం, రాజరాజేశ్వరి, శివతాండవం తదితర గీతాలకు దీక్షిత, వేదశ్రీ, భవాని, జాగృతి, శ్రావణి, అనురూప తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు.. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి.



శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

ఎఐతో సమస్యలకు పరిష్కారం..

ప్రపంచంలో ఎఐ విస్తరిస్తోంది. ప్రతి రంగంలోనూ వేగంగా వ్యాప్తిచెందుతోంది. దాన్ని అందిపుచ్చుకున్నవారు వేగంగా దూసుకెళ్తారు. లేకపోతే ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని సర్వేలు ఘోషిస్తున్నాయి. ఎఐ, రోబోలు ఏ రంగంలో వచ్చినా కూడా న్యాయ వ్యవస్థలో కూడా వస్తాయా?, చట్టాలు ఉన్నది ఉన్నట్టుగా తీర్పులు చెప్పగలవా? గత వారం రోజుల నుంచి ఓ వార్త ప్రచారంలో ఉంది. అదే ఇండియాలోని న్యాయ వ్యవస్థలో కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ని ప్రవేశపెట్టాలని, పెడుతున్నారని. దీనికి సంబంధించి ఎలాంటి అధికారిక ప్రకటన కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నుంచి రాలేదు. కానీ, చర్చ మాత్రం జరుగుతోంది. మొదట జిల్లా కోర్టుల్లో న్యాయవాదులకు ఎఐ మీద ట్రైనింగ్ ఇప్పించి ఆ తర్వాత వివిధ దశల్లో కింది కోర్టులు, హైకోర్టుల వరకు దీన్ని విస్తరిస్తారనే వాదన ఉంది. చిన్న చిన్న కేసులను ఎఐ ద్వారా పరిష్కరించి, పరిశీలించవచ్చనే అభిప్రాయంలో ఉన్నట్టు కనిపిస్తోంది. భారతదేశ 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగంలో ఓ ముఖ్యమైన పాయింట్ ఉంది. 'మూడో దశ ఈ కోర్టు ప్రాజెక్టు కూడా అప్రూవ్ అయింది. మనం మరింత టెక్నాలజీ దిశగా వెళ్తున్నాం. దీంట్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్ లాంటిని వినియోగిస్తాం. పెండింగ్ కేసులు, కొన్నిసార్లు భవిష్యత్తులో తలెత్తబోయే కేసులను కూడా మనం అంచనా వేయగలం. ఈ టెక్నాలజీ పోలీస్, ఫోరెన్సిక్, జైళ్లు, కోర్టుల్లో ప్రవేశపెడుతున్నాం. దీనివల్ల వారి పని వేగం పెరుగుతుంది. మనం భవిష్యత్ తరాలకు సరిపడే విధంగా న్యాయ వ్యవస్థను తీర్చిదిద్దబోతున్నాం' అని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. కొన్ని కొన్ని నివేదికల ప్రకారం భారతదేశంలో సుమారు 5.38 కోట్ల పెండింగ్ కేసులు ఉన్నాయి. ఆ కేసులు పెండింగ్‌లో ఉన్నాయంటే దానికి కారణం జడ్జీలు మాత్రమే కాదు. లాయర్లు, కొన్నిసార్లు నిందితులు కూడా కారణమే. ఇప్పుడు ఎఐని న్యాయ వ్యవస్థలోకి ప్రవేశపెట్టడం ద్వారా రోబో జడ్జిలను తీసుకొస్తే కేసులన్నీ వెంటనే పరిష్కారం అయిపోతాయా? వాయిదాలమీద వాయిదాలు వేసుకుంటూపోయే వ్యవస్థలో త్వరితగతిన కేసులు పరిష్కారం అయ్యేనా? ముఖ్యంగా రాజకీయ నేతలు, మతపరమైన అంశాలు ముడిపడిన కేసుల విషయంలో ఎఐ, రోబో జడ్జిలు తీర్పులు ఇవ్వగలవా?.

సత్వర న్యాయం అనేది జరుగుతుందో లేదో కానీ.. కొన్ని మంచి అంశాలు మాత్రం కచ్చితంగా ఉన్నాయి. టెక్నాలజీ పెరిగిపోతున్న యుగంలో మనం కూడా దానితోపాటు ముందుకు పరుగెత్తక తప్పదు. ఇలాంటి సమయంలో కోట్లాది కేసులు పెండింగ్‌లో ఉన్న న్యాయ వ్యవస్థలో కూడా ఎఐ వినియోగం వల్ల కొంత మేలు జరిగే అవకాశం లేకపోలేదు. సత్వర న్యాయం: పెద్ద కేసులు కాకపోయినా, రెగ్యులర్‌గా వచ్చే కేసులు, ఎప్పుడూ వచ్చే ఒకే రకమైన కేసులను ఫాస్ట్ ట్రాక్ చేయడంలో ఎఐ ఉపయోగపడుతుంది. పారదర్శకత: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేదానికి ఎమోషనల్ ఇంటెలిజెన్స్ అనేది ఉండదు. కేవలం ట్రైన్ చేయబడిన అంశాల మీద ఆధారపడి పనిచేస్తుంది. దీని వల్ల మన, తన అనే భేదం ఉండదు. ఒకే రకమైన కేసుల్లో ఒకే రకమైన తీర్పులను ఇవ్వడానికి సూచనలిస్తుంది. అది పేదలైనా? పెద్దలైనా?. తద్వారా తీర్పుల్లో పారదర్శకత వస్తుంది. జడ్జిలపై పనిభారం తగ్గుతుంది, జడ్జీలు రెగ్యులర్‌గా చేసే పనులు (కొన్ని వేలపేజీల చార్జిషీట్‌లు చదవడం, సాక్షుల వాంగ్మూలాలు పదే పదే చూడాల్సి రావడం) కొంత సులువు అయిపోతాయి. చాలా వరకు పని ఎఐ చేసేయడం వల్ల జడ్జీలు త్వరితగతిన తీర్పులు ఇవ్వగలరు. కోర్టు అంటే కంప్యూటర్ కాదు. రెండు రెళ్లు నాలుగు అని చెప్పడానికీ న్యాయమూర్తులు మానవత్వం చూపిస్తుంటారు. ఆ కేసు సందర్భాన్ని బట్టి మానవతా కోణంలో చూడాల్సి ఉంటుంది. అలాగే, నైతిక విలువలు కూడా ముఖ్యం. ఎఐ ద్వారా తీర్పులు ఇస్తే ఇలాంటివేవీ మనకు కనిపించవు. ఎఐ దేవుడు కాదు. ఎఐ అనేది కూడా మనిషి చేసిన ఒక టెక్నాలజీ. ఆ ఎఐని ఎలా ట్రైన్ చేశామనేది కూడా ముఖ్యం. ఒక వర్గానికి అనుకూలంగా ఉండేలా ఎఐని ట్రెయిన్ చేస్తే అది ఆ వర్గానికి అనుకూలంగానే అభిప్రాయాలు చెప్పే ప్రమాదం ఉంటుంది. కోర్టు తీర్పుల్లో ఇలాంటివి చూసుకోకపోతే పెను ప్రమాదానికి దారి తీస్తుంది. కోర్టు తీర్పుల్లో ముఖ్యమైనది రీజనింగ్. ఏ కారణాల వల్ల, ఏయే అంశాలను బేరీజు వేసుకుని.. తాము ఈ తీర్పు చెబుతున్నామనేది న్యాయమూర్తులు ఆ తీర్పు కాపీలో చెబుతారు. దాని వల్ల న్యాయవాదులు, కక్షిదారులకు క్లియర్‌గా అర్థం అవుతుంది. వారు పైకోర్టుకు వెళ్లాలనుకుంటే దీన్ని వారు సవాల్ చేయడానికి సులువు అవుతుంది. ఏ కొత్త టెక్నాలజీలో అయినా సమస్యలు, సవాళ్లు ఉంటాయి. మరీ ముఖ్యంగా న్యాయ వ్యవస్థ లాంటి చోట ఎఐని నమ్ముకుంటే న్యాయం జరగాల్సిన చోట అన్యాయం జరుగుతుందేమో అనే భయం కూడా ఉంటుంది. మనం ఇక్కడో ఉదాహరణ చెప్పుకోవాలి. కొన్ని దశాబ్దాల క్రితం కంప్యూటర్లు వచ్చిన కొత్తలో వర్క్ లోడ్‌ను మేనేజ్ చేయడానికి కంప్యూటర్లు తీసుకోవాలని కొన్ని బ్యాంకులు భావించాయి. అయితే, దీన్ని అప్పటి ఉద్యోగులు అత్యంత తీవ్రంగా వ్యతిరేకించారు. కంప్యూటర్లు తప్పులు చేస్తాయని.. వాటి వల్ల సమస్యలు వస్తాయని, తమకు ఉద్యోగ భద్రత ఉండదని చాలా ఆందోళనలు కూడా చేశారు. కానీ ఇప్పుడు 2025లో కంప్యూటర్ లేని బ్యాంక్ లేదు. అలాగే, తొలి నాళ్లలో కొన్ని సవాళ్లను జడ్జీలు ఎదుర్కోవాల్సి రావొచ్చు. కానీ భవిష్యత్తులో అది సమస్యలను తక్కువ చేసుకుంటూ వెళ్తుంది. ఏదేమైనా ఇప్పటికిప్పుడు కోర్టుల్లో ఎఐ అనేది అంత సులువైన వ్యవహారం కాదు. కానీ, 5 కోట్లకు పైగా ఉన్న పెండింగ్ కేసులు 10 కోట్లకు పెరగకుండా ఉండాలంటే కచ్చితంగా ఒక చరిత్రాత్మక, సంచలనాత్మక నిర్ణయం తీసుకోవాలి.

## పురపాలక శాఖ మంత్రి నారాయణను కలిసిన బిజెపి నాయకులు





మన గళండోన్ పట్టణానికి విచ్చేసినటువంటి పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు పొంగూరునారాయణ ని కలిసిన డోన్ బిజెపి నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు సందు వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఒంటెద్దు బండి కిరణ్, పట్టణ అధ్యక్షులు బద్రి సుధాకర్ మండల అధ్యక్షులు బొంకురి రవికుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఉపాధ్యక్షులు విజయ్ భాస్కర్, సుబ్రహ్మణ్యం తదితరులు కలిసి పూలమాలవేసి శాలువతో సన్మానించారు.

## వైసీపీ నేతల అన్నదాత పోరు కు పోలీసులు ఆంక్షలు

మనగళం, కర్నూలు సిటీ : రైతులకు మద్దతుగా వైసీపీ నేతలు చేపట్టిన అన్నదాత పోరు నిరసన కార్యక్రమానికి పోలీసులు ఆంక్షలు విధించారు. వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి ఇంటికి వెళ్ళిన పోలీసులు 30 యాక్ట్ అమలులో ఉందని నిరసన ర్యాలీలు చేపట్టకూడదని హెచ్చరించారు. కేవలం పది మంది తో ఆర్డిఓ కు వినతిపత్రం అందించాలని సూచించారు. తమ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## కన్నతల్లి మందలించిందని కోడుమూరు పట్టణంలో బోయ భాస్కర్ ఆత్మహత్య


భాస్కర్ ఫైల్ ఫోటో

మన గళం కోడుమూరు: కోడుమూరు పట్టణానికి చెందిన యువకుడు బోయ భాస్కర్ ( 20) కోడుమూరు టౌన్ లోని బీసీ కాలనీలో నివాసం ఉంటూ గౌండ పనిచేయటం వల్ల జీవనం సాగిస్తున్నాడు. మృతునికి ఇంకా వివాహం కాలేదు. అతడు ప్రతిరోజు మద్యం తాగి ఇంటికి వచ్చి తన తల్లిని వేధిస్తూ ఉండేవాడు. అతని తల్లి నిత్యం దండిస్తూ ఉండేది. సోమవారం ఉదయం ఏడు గంటలకే మద్యం తీసుకొని వచ్చి ఇంటి వద్ద తాగుతుండగా తన తల్లి దండించినందున అందుకు అతడు మనస్థాపము చెంది పక్కన ఉన్న కొట్టములోకి వెళ్లి చీరతో ఉరి వేసుకుని చనిపోయాడని, అతని తల్లి కమల భర్త లేట్ రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోడుమూరు ఎస్సై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

## ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



మనగళం, కల్లూరు : కల్లూరు మండల పరిధిలోని పుసులూరు గ్రామంలో వెలసిన ఎల్లమ్మ అమ్మవారి మంగళవారం గ్రామ నాయకుడు పల్లె ప్రతాప్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన ఆహ్వానం మేరకు అమ్మవారిని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి దర్శించుకున్నారు. అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాటసానిని గ్రామ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్, మండల నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## హంద్రీలో ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లను తొలగించాలి



మనగళం, కల్లూరు : కల్లూరు అర్బన్ పరిధి,32వ వార్డ్ ప్రాంతం హంద్రీ నదిలో పెరిగిన ముళ్ల చెట్లను తొలగించాలని ఆ వార్డ్ కేవీపీఎస్ అధ్యక్షులు ఈ.రామాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం కేవీపీఎస్ నాయకులు హంద్రీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీ నదిలో పూర్తి స్థాయిలో ముళ్ల చెట్లు పెరిగి అసాంఘీక కార్యక్రమాలకు నెలవుగా మారిందన్నారు. మరోవైపు స్థానిక ప్రజల ఇళ్లల్లోకి పాములు,తేళ్లు వంటి విషపురుగులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు అనారోగ్యాలకు గురవుతూ ఇబ్బందులు పడుతన్నట్లు చెప్పారు. సమస్యలపై పలుమార్లు సచివాలయం, నగర పాలక సంస్థ అధికారులకు వినతులు అందచేసిన పట్టించుకోని దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ కమిషనర్ స్పందించి, తక్షణమే హంద్రీ నదిలో పెరిగిన ముళ్ల చెట్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు వెంకటేష్, చిట్టిబాబు, రాజు, వెంకట్,సూరి పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి సర్కార్ విఫలం





మనగళం, నంద్యాల : వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు మంగళవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి రైతులు తరలివచ్చారు. కాటసాని ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. నంద్యాలలోని బొమ్మల సత్రం నుండి పెద్ద ఎత్తున రైతులతో కలిసి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. కూటమి సర్కార్ కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. రైతుకు న్యాయం చేయాలని... గిట్టుబాటు ధర కల్పించాలని... యూరియా బ్లాక్ మార్కెట్ కు తరలింపును అరికట్టాలన్న నినాదాలు హోరెత్తాయి. నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా రవిరెడ్డి, గంగుల నాని, రాష్ట్ర కార్యదర్శులు బుడ్డా శేషా రెడ్డి, భూమా కిషోర్ రెడ్డి, పీపీ మధుసుధాన్ రెడ్డి, పీపీ నాగి రెడ్డి, మున్సిపల్ చైర్మన్పర్సన్ మాబున్నిసా, పాణ్యం మాజీ జడ్పీటీసీ సూర్య నారాయణ రెడ్డి తదితర నాయకులతో కలిసి కాటసాని ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి సర్కార్ విఫలమైందన్నారు. రైతులు పండించిన దిగుబడులకు కనీసం గిట్టుబాటు ధర కల్పించడం లేదని విమర్శించారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు వారికి అండగా వైసీపీ పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటుందని హెచ్చరించారు.

# దేశవ్యాప్తంగా అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్, మినివర్కర్స్ కు తక్షణమే వేతనాలు పెంచాలి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.





ఈరోజు ఉదయం 10 గంటలకు కర్నూలులో, భారీ పరిశ్రమల శాఖ మంత్రివర్యులు, గౌరవనీయులు భరత్ గారిని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితతో పాటు జిల్లా ప్రతినిధుల బృందం జాతీయ పిలుపులో భాగంగా కలవడం జరిగింది. గౌరవనీయులు టీజీ భరత్ గారికి, జాతీయ స్థాయిలో 12 సంవత్సరాల నుండి గౌరవ వేతనాలు పెంచలేదని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రోజురోజుకు పని భారం పెంచుతున్నారని, ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం పనిచేయలేమని, సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అందరికీ వర్తింప చేయాలని, 5%స్రవి% మొబైల్స్ తక్షణమే ఇవ్వాలని, గ్రాజుడుటి లో తక్షణమే సవరణలు చేసి 1972 యాక్ట్ ప్రకారం ఆంధ్రప్రదేశ్లో చెల్లించాలని, అంగన్వాడి కేంద్రాలకు నాణ్యమైన సరుకులు ప్రభుత్వమే చేర్చాలని, ప్రతినెల వేతనాలు బిల్లులు సక్రమంగా ఇవ్వాలని, ప్రధానమైన అంశాలను వివరించడం జరిగింది. మా సమస్యలన్నీ ప్రధానమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కారమయ్యే విధంగా మీరు కృషి చేయాలని, మంత్రివర్యులకు తెలియజేయడం జరిగింది. మంత్రివర్యులు ప్రధాన మంత్రి దృష్టికి తీసుకొని వెళ్తానని తెలియజేశారు. వారికి అసోసియేషన్ నుండి అభినందనలు తెలియజేశాము. మంత్రివర్యులను కలిసిన వారిలో, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి,ఎస్. మునెప్ప, %ూ×ుఖజ% సిటీ సెక్రటరీ చంద్రశేఖర్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి. %ఖ%. చౌదేశ్వరి, జిల్లా కౌన్సిల్ సభ్యులు మంజుల, పార్వతి, రత్నమ్మ లు పాల్గొన్నారు.

# డంప్ యార్డును పరిశీలించిన పురపాలక శాఖ మంత్రి నారాయణ ఎమ్మెల్యే కోట్ల





మన గళండోన్ పట్టణంలోని లెగసీ వ్యర్థ నిర్వహణ ప్లాంట్ (డంప్ యార్డ్)ను డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మరియు ఆంధ్రప్రదేశ్ పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ స్వయంగా సందర్శించి పరిశీలించారు. పట్టణ ప్రజల శ్రేయస్సు, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత కోసం చేపట్టిన ఈ కార్యక్రమం యొక్క ప్రగతిని వివరంగా తెలుసుకుని, అధికారులు మరియు సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. డంప్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో శుభ్రత, కాలుష్య నియంత్రణ చర్యలు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన మరిన్ని అభివృద్ధి చర్యలపై చర్చించారు.ఈ సందర్భంగా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆధునిక సాంకేతికతను వినియోగించి వ్యర్థ నిర్వహణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రివర్యులు తెలిపారు. డోన్ మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను కేటాయించాలని మంత్రి ని డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, నారా చంద్రబాబు నాయుడుతో చర్చించి తక్షణమే అవసరమైనా నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

# వినియోగదారులకు పూర్తి జీఎస్టీ ప్రయోజనాలు



మన గళం : కేంద్ర మంత్రి పియూష్ గోయల్ జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలను పూర్తిగా ప్రజలకు అందించాలని మరోసారి పరిశ్రమ వర్గాలను కోరారు. దీనివల్ల దేశీయ డిమాండ్‌ను పెరుగుతుంది, వ్యాపారాలకు కొత్త అవకాశాలను తెరుస్తుంది, దేశ ఆర్థికవ్యవస్థ పునాదులను బలోపేతం చేస్తుందని అన్నారు. సోమవారం ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్(ఈఈపీసీ) ఇండియా కార్యక్రమంలో పీయుష్ గోయల్ మాట్లాడుతూ.. 'పన్ను సరళీకరణతో పాటు జీఎస్టీ రేటు కోతలు దేశీయ డిమాండ్‌ను పెంచుతాయి. చిన్న, పెద్ద సంస్థలు మరిన్ని అవకాశాలను పొందుతాయి, ఉద్యోగావకాశాలు, ఆదాయాలు పెరుగుతాయి. ఇది దేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఒక మంచి వృద్ధి అవకాశమన్నారు. ఈ సందర్భంగా గోయల్.. ప్రపంచంలోని ఏ శక్తి కూడా భారత్‌ను ప్రపంచ సూపర్ పవర్‌గా ఎదగకుండా ఆపలేదని విశ్వాసం వ్యక్తం చేశారు. దాన్ని దృష్టిలో ఉంచుకునే సమాన ప్రయోజనాలు ప్రతి పౌరుడికి అందాలని, జీఎస్టీ కోత ప్రయోజనాలు వినియోగదారులకు నేరుగా చేరాలని ఆయన అన్నారు. ఇది సమ్మిళిత వృద్ధిని, పటిష్టమైన ఆర్థికవ్యవస్థను అందిస్తుందని చెప్పారు. ప్రస్తుతం దాదాపు 4 ట్రిలియన్ డాలర్ల విలువైన మన ఆర్థికవ్యవస్థ, రాబోయే 2-2.5 ఏళ్లలో ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది. 2047 నాటికి కనీసం 30 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని పీయుష్ గోయల్ అంచనా వేశారు. జీఎస్టీ సరళీకరణ, మౌలిక సదుపాయాల వృద్ధితో, మనదేశం ప్రపంచ శక్తిగా అవతరించే మార్గంలో బలంగా ఎదుగుతోందని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ పిలుపును స్వీకరించి స్వదేశీ ఉత్పత్తుల వాడకాన్ని పెంచేందుకు మద్దతు ఇవ్వాలని పరిశ్రమలను కోరారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, మనం తయారు చేసుకున్న వస్తువులను ప్రోత్సహించడం ద్వారా, వ్యాపారాలు ఆర్థిక భద్రత, జాతీయ పురోగతికి దోహదపడతాయని వివరించారు. దేశంలో తయారైన అధిక-నాణ్యతా ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా అమ్ముడయ్యేలా చూసుకోవాల్సిన అవసరాన్ని పీయుష్ గోయల్ ప్రస్తావించారు. మనదేశం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయ భాగస్వామిగా ఉంది. దాన్ని కొనసాగించడం చాలా ముఖ్యం అని అన్నారు.

# ఐపీఓకు సిద్ధమవుతున్న ఎల్‌జీ ఇండియా




మన గళం : దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం ఎల్‌జీ ఈ ఏడాదిలోనే అతిపెద్ద ఐపీఓకు సిద్ధమవుతోంది. ఎల్‌జీ కంపెనీ తన ఇండియా యూనిట్ అయిన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూను ప్రారంభించనుంది. స్టాక్ మార్కెట్ల నుంచి కంపెనీ సుమారు రూ. 15,000 కోట్ల వరకు నిధులను సమీకరించేందుకు అక్టోబర్ మొదటివారంలో సబ్‌స్క్రిప్షన్ ప్రారంభిస్తుందని బ్యాంక్ వర్గాలు తెలిపాయి. అయితే, ప్రస్తుతం ఈక్విటీ మార్కెట్లు హెచ్చుతగ్గులకు లోనవుతున్న కారణంగా స్థిరమైన పరిస్థితుల కోసం కంపెనీ ఎదురుచూస్తోంది. ఇప్పటికే సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఎల్‌జీ ఇండియా పబ్లిక్ ఇష్యూకు ఆమోదం తెలిపింది. కంపెనీ తన ఇండియాలోని 15 శాతం వరకు వాటాను విక్రయించాలని భావిస్తోంది. అంటే ఇది దాదాపు 10.2 కోట్ల షేర్లకు సమానం. గతేడాది అక్టోబర్‌లో హ్యుండాయ్ ఐపీఓ తర్వాత, దేశంలో ఇదే రెండవ అతిపెద్ద ఐపీఓ కానుంది. 2025లో ఇప్పటివరకు దాదాపు 30 ఐపీఓలు రూ. 60,000 కోట్లకు పైగా సేకరించాయి. వీటిలో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ. 12,500 కోట్ల ఐపీఓనే అతిపెద్దది. ఎల్‌జీ ఇండియాతో పాటు ఈ ఏడాది టాటా కేపిటల్, అర్బన్ కంపెనీ, బోట్ వంటి ప్రముఖ కంపెనీలు కూడా ఐపీఓ కోసం సిద్ధంగా ఉన్నాయి.

# విద్యార్థి మృతిపై తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే కోట్ల






మన గళండోన్ పట్టణంలోని శ్రీరామ్ నగర్ బి.సి. హాస్టల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎం.పి.సి చదువుతున్న విద్యార్థి శ్యామ్ సుందర్ నిన్న ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర సంఘటన డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడి సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను ఆరా తీశారు. విద్యార్థుల సమస్యలను సకాలంలో గుర్తించి పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు విద్యార్థుల భద్రత, సౌకర్యాలు, మానసిక స్థితిగతులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# బయలు వీరభద్రస్వామికి ప్రదోషకాల అభిషేకం





మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (09.09.2025) సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను జరిపించనున్నది. ప్రతీ మంగళవారం మరియు అమావాస్యరోజులలో బయలువీరభద్రస్వామివారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించబడుతున్నాయి. బయలువీరభద్రస్వామివారు శివభక్తగణాలకు అధిపతి. అదేవిధంగా శ్రీశైలక్షేత్రపాలకుడుగా క్షేత్రానికి ఆరుబయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు కనుక ఆయనకు బయలువీరభద్రస్వామి అని పేరు వచ్చింది. ప్రసన్నవదనంతో కిరీట మకుటాన్ని కలిగి దశభుజుడైన స్వామివారు పది చేతులలో వివిధ ఆయుధాలతో దర్శనమిస్తాడు. స్వామివారికి క్రిందివైపున కుడివైపు దక్షుడు, ఎడమవైపు భద్రకాళి దర్శనమిస్తారు. ఈ స్వామిని దర్శించినంత మాత్రానే ఎంతటి క్లిష్ట సమస్యలైనా తొలగిపోతాయని, వ్యాధులు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని ప్రసిద్ధి. ముఖ్యంగా ఆగమసంప్రదాయంలో క్షేత్రపాలక పూజకు చాలా విశేషస్థానం ఉంది. క్షేత్ర పాలకుడికి పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయం, బాధలు లేకుండా సుఖసంతోషాలతో ఉంటారు. మంగళవారం, ఆదివారం మరియు అమావాస్య రోజులలో చేసే వీరభద్రపూజ అనేక ఫలితాలు ఇస్తుందని ఆగమశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్టదోషాలు, దుష్టగ్రహపీడలు తొలగిపోతాయి. అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి. ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక




## తేజ సజ్జను అవమానించిందెవరు?

మన గళం : 'హనుమాన్' సినిమాతో ఒక్కసారిగా పాన్ ఇండియా స్థాయిలో స్టార్ అయిపోయాడు తేజ సజ్జ. ఆ సినిమాకు ముందు హీరోగా తనేమంత పాపులర్ కాదు. బాల నటుడిగా చాలా సినిమాలు చేసినప్పటికీ.. ఓ బేబీ, జాంబి రెడ్డి సినిమాలతో తనకు వచ్చిన గుర్తింపు తక్కువే. కానీ 'హనుమాన్'తో తన కెరీర్ మారిపోయింది. అలా అని అంతకుముందు అతను కెరీర్లో ఇబ్బందులు పడకుండా ఏమీ లేదు. హీరో కావాలనుకున్నపుడు అవకాశాల కోసం అతనూ దర్శక నిర్మాతల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఆ సమయంలో ఒక పెద్ద దర్శకుడు తనను ఎలా ఆశ చూపి ఎలా దెబ్బ కొట్టాడో 'మిరాయ్'కి సంబంధించిన ఓ ప్రమోషనల్ ఇంటర్వ్యూలో వెల్లడించాడు తేజ. తాను హీరో అవ్వాలనుకున్నపుడు ఎన్నో కష్టాలు పడ్డానని.. మోసాలు, రిజెక్షన్లు, అవమానాలు అన్నీ చూశానని తేజ తెలిపాడు. తనను మోసం చేసిన వాళ్లలో చాలామంది పెద్ద మనుషులు ఉన్నారని అతనన్నాడు. ఒక స్టార్ డైరెక్టర్ తనకు కథ చెప్పి షూటింగ్ మొదలు పెట్టాడని.. 15 రోజులు షూటింగ్ కూడా చేశాడని.. కానీ ఒక రోజు హఠాత్తుగా సెట్స్‌కు ఇంకో హీరో వచ్చాడని.. ఆ సినిమాలో అతనే హీరో అని అప్పుడు తనకు అర్థమైందని తేజ వెల్లడించాడు. తన కంటే ముందు ఆ హీరోకు కథ చెప్పిన ఆ దర్శకుడు.. తనకు సీన్స్ చూపించడం కోసం తనతో మాక్ షూట్ చేశాడని తర్వాత తెలిసిందని తేజ బాధాకరమైన విషయాన్ని బయటపెట్టాడు. ఇది ఎలాంటి వ్యక్తికైనా ఎంతో బాధ కలిగించే విషయం అనడంలో సందేహం లేదు.



## లిటిల్ హార్ట్స్ విజయ రహస్యం..

మన గళం : హెడింగ్ చూసి ఆశ్చర్యపోతున్నారా. టాలీవుడ్ దర్శక నిర్మాతలు కొందరు ప్రస్తుతం ఇదే ప్రశ్న వేసుకుంటున్నారు. ఎలాంటి అంచనాలు లేకుండా ఒక ఓటిటి సినిమాగా మొదలై థియేటర్లలో విడుదలైన లిటిల్ హార్ట్స్ ఇంత పెద్ద విజయం సాధించడం చూసి చాలా మందికి నిద్ర రావడం లేదు. సోషల్ మీడియాలో పాపులరైన మౌళిని టికెట్లు కొని మరీ థియేటర్లలో చూస్తారా అనే అనుమానాలు బద్దలు కొడుతూ కేవలం మూడు రోజులకే పన్నెండు కోట్ల గ్రాస్ వసూలు చేయడం ఆషామాషి విషయం కాదు. అందులోనూ మొదటి రోజే బ్రేక్ ఈవెన్ కావడం ఈ మధ్య కాలంలో ఏ సినిమాకు జరగలేదన్నది అందరూ ఒప్పుకునే వాస్తవం. మరి లిటిల్ హార్ట్స్ ఇంతగా సక్సెస్ కావడానికి కారణమేంటని తెలుసుకోవడానికి పెద్దగా రీసెర్చ్ అక్కర్లేదు. చిన్న కామన్ సెన్స్ అంతే. ప్రేక్షకులు వరల్డ్ బిల్డింగ్ సినిమాలు చూసి బోర్ కొట్టేసి కాస్త ఫ్రెష్ నెస్, ఎంటర్ టైన్మెంట్ కోసం ఎదురు చూస్తున్నారు. టయర్ 2 స్టార్లు సైతం కెజిఎఫ్, పుష్ప లాంటివి కోరుకుంటూ నిర్మాతలతో కోట్లు ఖర్చు పెట్టిస్తున్న టైంలో ఓ రెండు గంటలు నవ్వుకునే సినిమాలు రావడం తగ్గిపోయింది. జాతిరత్నాలు తర్వాత మళ్ళీ ఆ స్థాయి ఇంపాక్ట్ వేరే మూవీ చూపించలేదు. అంత కాకపోయినా లిటిల్ హార్ట్స్ ఈ మాత్రం గ్రాండ్ రెస్పాన్స్ దక్కించుకోవడం భుజాలు తడుముకుని మరీ ఆలోచించాల్సిన విషయం. వీక్ డేస్ మొదలయ్యాయి కాబట్టి డ్రాప్స్ ఎంత శాతం ఉంటాయనే దాన్ని బట్టి లిటిల్ హార్ట్స్ రేంజ్ ఆధారపడి ఉంది. నిర్మాతలు ఇప్పటికే లాభాల్లో ఉన్నారు. ఈటీవీ విన్ మరో జాక్ పాట్ కొట్టేసింది.

## జడలో మల్లెపూలకు లక్ష రూపాయల జరిమానా



మన గళం : దక్షిణ భారతీయులకి మల్లెపూలంటే ఎంత ప్రత్యేకమో చెప్పక్కర్లేదు. ప్రతి పండుగ, వేడుక, రోజువారీ జీవితంలోనూ మహిళలు జుట్టులో మల్లెపూలు ధరించడం ఆనవాయితీ. కానీ ఈ సాంప్రదాయ అలవాటు ఆస్ట్రేలియాలో ఒక పెద్ద సమస్యగా మారింది. మలయాళ నటి నవ్యా నాయర్ తాజాగా దీనికి ఉదాహరణ అయ్యారు. మెల్‌బోర్న్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆమె దగ్గర 15 సెంటీమీటర్ల పొడవు గల మల్లె గజ్రా ఉన్నందుకు అధికారులు రూ. 1.14 లక్షల జరిమానా వేశారు. నవ్యా ఆస్ట్రేలియాలోని మలయాళీ సంఘం నిర్వహించిన ఓనమ్ వేడుకల్లో పాల్గొనడానికి వెళ్ళారు. బయలుదేరే ముందు ఆమె తండ్రి మల్లెపూలు కొనిచ్చి, "కోచి నుంచి సింగపూర్ వరకు ఒక భాగం వాడుకో, మిగతావి హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకో" అని ఇచ్చారు. అదే మెల్‌బోర్న్ ఎయిర్‌పోర్ట్‌లో ఆమెను ఇబ్బందుల్లోకి నెట్టింది. "నేను చేసినది చట్టానికి విరుద్ధమని అక్కడే తెలిసింది. అనుకోకుండా చేసినా తప్పే అని అధికారులు చెప్పారు. జరిమానా 28 రోజుల్లో చెల్లించాల్సిందే అన్నారు" అని నవ్యా వెల్లడించారు. ఇక ఆస్ట్రేలియా బయోడైవర్సిటీ రూల్స్ ప్రకారం, పూలు, పండ్లు, విత్తనాలు, మొక్కల వేర్లు వంటి వాటిని బయట నుంచి దేశంలోకి తీసుకెళ్లరాదు. అవి స్థానిక పర్యావరణానికి హాని కలిగించే అవకాశముందని భావిస్తారు. అందుకే చిన్న గజ్రా ఉన్నా జరిమానా తప్పదని అధికారులు చెబుతున్నారు. ఆకస్మిక జరిమానా ఆమెను షాక్‌కు గురిచేసినా, ఓనమ్ ఉత్సాహం మాత్రం తగ్గలేదు. మెల్‌బోర్న్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొని అభిమానులతో ఫోటోలు పంచుకున్నారు. "ఆకాశంలోనే నా మొదటి తిరువోణం జరుపుకున్నా" అంటూ సోషల్ మీడియాలో రీల్ కూడా పోస్ట్ చేశారు.

## ఆ ఇద్దరికీ జాక్ పాట్



మన గళం : బన్నీ వాసు అంటే గీతా ఆర్ట్స్.. గీతా ఆర్ట్స్ అంటే బన్నీ వాసు.. రెండు దశాబ్దాలకు పైగా సాగుతున్న బంధమిది. అల్లు అర్జున్ స్నేహితుడిగా గీతా ఆర్ట్స్‌లోకి ప్రవేశించిన వాసు.. బయటి వాడు అయినప్పటికీ.. అల్లు కుటుంబంలో ఒకడిలా మారిపోయాడు. నిర్మాణ సంస్థను అతడి చేతికి అప్పగించి ప్రొడక్షన్ మొత్తం తనే చూసుకునే స్వేచ్ఛ ఇచ్చారు అల్లు అరవింద్. అల్లువారి అనుభవం, వాసు యంగ్ మైండ్ కలిసి ఆ సంస్థ విజయవంతంగా సాగుతోంది. ఒకప్పటి దిగ్గజ నిర్మాణ సంస్థలు చాలానే ప్రొడక్షన్ ఆపేసి తెరమరుగు అయిపోగా.. గీతా ఆర్ట్స్ మాత్రం సక్సెస్ ఫుల్‌గా సాగడంలో బన్నీ వాసు పాత్ర కీలకం. ఐతే ఈ మధ్య వాసు తనకంటూ ఒక నిర్మాణ సంస్థ ఉండాలనుకున్నాడు. అలా అని అతనేమీ గీతా సంస్థ నుంచి బయటికి వచ్చేయలేదు. అరవింద్‌తో విభేదించలేదు. తన అభిరుచి మేరకు వేరుగా సినిమాలు నిర్మించడం, డిస్ట్రిబ్యూట్ చేయాలనుకున్నాడు. అందులో భాగంగానే మిత్రమండలి అనే సినిమాను నిర్మిస్తున్నాడు. దీంతో పాటు వంశీ నందిపాటితో కలిసి లిటిల్ హార్ట్స్ అనే చిన్న సినిమాను డిస్ట్రిబ్యూట్ చేశాడు. బన్నీ వాసు 'లిటిల్ హార్ట్స్'ను డిస్ట్రిబ్యూట్ చేయడం వెనుక మరో వ్యక్తి పాత్ర కీలకం. అతనే.. వంశీ నందిపాటి. కంటెంట్ ఉన్న చిన్న సినిమాలను గుర్తించి డిస్ట్రిబ్యూట్ చేసి మంచి ఫలితాలు అందుకుంటాడని వంశీకి పేరుంది. 'పొలిమేర-2' సహా కొన్ని చిత్రాలతో అతను సక్సెస్ సాధించాడు. 'లిటిల్ హార్ట్స్'లో మంచి కంటెంట్ ఉందనే విషయాన్ని గుర్తించి.. బన్నీ వాసుకు సినిమా చూపించి, ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చాక తనతో కలిసి సినిమాను కొని రిలీజ్ చేసింది వంశీనే. చిన్న బడ్జెట్ సినిమా కావడంతో రూ. 2.5 కోట్లకే సినిమా హక్కులు దక్కాయి.

## ఈ సినిమాతోనే డైరెక్టర్ నా పార్టనర్ అయ్యాడు..



మన గళం : తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు మరో సూపర్ హీరో మూవీ సిద్ధమవుతోంది. 'ఇట్స్ మై లవ్‌స్టోరీ' ఫేమ్ అరవింద్ కృష్ణ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ మూవీ 'ఏ మాస్టర్ పీస్' అనే టైటిల్‌తో దర్శకుడు సుకు పూర్వజ్ తెరకెక్కిస్తున్నాడు. ఇందులో జ్యోతి పూర్వజ్, మనీష్ గిలాడ, అషు రెడ్డి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీకాంత్ కండ్రేగుల, మనీష్ గిలాడ, ప్రజయ్ కామత్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీని వచ్చిన టీజర్‌కు సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. క్లైమాక్స్ సీన్స్ రూపొందిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా మీడియాతో ముచ్చటించారు మూవీ టీమ్. ఇందులో భాగంగా.. హీరోయిన్ జ్యోతి పూర్వాజ్ మాట్లాడుతూ 'నేను రెండేళ్ల కిందట ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చాను. ఆ తర్వాత ఈ సినిమా వల్ల పూర్వాజ్ నా లైఫ్ పార్టనర్‌గా మారాడు. 'ఏ మాస్టర్ పీస్' సూపర్బ్ స్క్రిప్ట్‌తో వస్తోంది. ఈ చిత్రంలో నా క్యారెక్టర్ డిఫరెంట్ వేరియేషన్స్‌లో ఉంటుంది. ప్రేక్షకులు ఒక్కోసారి ఆశ్చర్యపోతారు. నా కెరీర్‌లో నటిగా సంతృప్తినిచ్చిన క్యారెక్టర్ ఇది. మైథాలజీని, సూపర్ హీరో జానర్‌ను కలిపి ఒక గొప్ప చిత్రాన్ని డైరెక్టర్ పూర్వాజ్ రూపొందిస్తున్నారు. నేను పేర్లు చెప్పను గానీ తెలుగులో వచ్చిన కొన్ని గొప్ప చిత్రాల సరసన 'ఏ మాస్టర్ పీస్' చేరుతుంది. సూపర్ హీరోను మనం ఎలా ఊహించుకుంటామో అలా అరవింద్ కృష్ణ కనిపిస్తారు. అరవింద్ కృష్ణతో నేను గతంలో ఓ చిత్రంలో నటించాను. మా ప్రొడ్యూసర్స్ అందరికీ థ్యాంక్స్. భారీ మేకింగ్‌తో 'ఏ మాస్టర్ పీస్' రూపొందిస్తున్నాం. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది' అని తెలిపింది.



## కాజల్ ప్రమాదంపై వదంతలు..

మన గళం : టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ కు ఘోర రోడ్డు ప్రమాదం జరిగినట్లు పలు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ ప్రమాదంలో కాజల్ ప్రాణాలు కోల్పోయినట్లు పలు పుకార్లు సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్నాయి. వీడియోలు కూడా వైరల్ అయ్యాయి. దీంతో ఈ విషయం తెలుసుకున్న అభిమానులు ఆందోళన చెందుతూ పలు పోస్టులు పెడుతున్నారు. ఆమెను ట్యాగ్ చేస్తూ కోలుకోవాలని కామెంట్లు చేస్తున్నారు. ఈక్రమంలో.. తాజాగా, కాజల్ అగర్వాల్ ట్విట్టర్ ద్వారా యాక్సిడెంట్ వార్తలపై స్పందించి క్లారిటీ ఇచ్చింది. "నేను ప్రమాదానికి గురైనట్లు వస్తున్న వార్తలు నా దృష్టికి వచ్చాయి. అలాగే నేను లేనని కూడా ప్రచారం చేశారు. అందులో వాస్తవం లేదు. నిజం చెప్పాలంటే అవి చూసి నేను చాలా నవ్వుకున్నాను. ఎందుకంటే.. ఇంతకుమించిన ఫన్నీ న్యూస్ ఉండదు. అవన్నీ పూర్తిగా అవాస్తవం. దేవుడి దయ వల్ల నేను క్షేమంగా, సురక్షితంగా ఉన్నాను. అంతేకాకుండా మరింత బాగానే ఉన్నానని మీ అందరికీ తెలుపుతున్నాను. ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మవద్దని లేదా ప్రచారం చేయవద్దని నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను. ప్రేమ కృతజ్ఞతతో మీ కాజల్" అని రాసుకొచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. దీంతో అది చూసిన అభిమానులు కాస్త ఊపిరిపీల్చుకున్నారు.

# పదవులు కాదు..పార్టీ ముఖ్యం













- నిబద్ధత కలిగిన వారు భాజపా కార్యకర్తలు
- పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా
- ఏ.పి.ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర
- నగరూరును ఘనంగా సన్మానించిన భాజపా నేతలు

(మన గళం,కర్నూలు వి.ఆర్.కాలని) : తమకు పదవులు ముఖ్యం కాదని, పార్టీయే ముఖ్యమని ఏ.పి.ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర స్పష్టం చేశారు. భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు నిబద్ధత కలిగిన వారని ఆయన పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని స్థానిక వెంకట రమణ కాలనీలోని ఏ.ఎస్.ఎన్.గుడ్ విల్ టవర్స్ లో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జయశ్రీ ఆధ్వర్యంలో డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా పలువురు భాజపా నేతలు ఆయనకు శాలువాలు కప్పి,పూలమాలలు వేసి,అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవులు ఆశించకుండా, పని చేసుకుంటూ పోయే తత్వం మరే ఇతర పార్టీల్లో లేని విధంగా కేవలం ఒక్క భాజపా కార్యకర్తల్లోనే ఉందన్నారు. పార్టీ అధిష్టానం సైతం పార్టీ బలోపేతానికి,పటిష్టతకు శ్రమించే కార్యకర్తలను ఎన్నడూ విస్మరించదన్నారు. పార్టీ కార్యకర్తలకు తానెల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. పార్టీ కోసం అహరహం శ్రమిస్తూనే,తనపై నమ్మకంతో తనకిచ్చిన పదవీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, ఆ పదవికే వన్నె తెచ్చే రీతిలో వ్యవహరిస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి, భాజపా కోశాధికారి,వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళీ నాయుడు, జిల్లా అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ లోకేశ్,న్యాయవాది కోటి యాదవ్,ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్ నాయుడు, మంజునాథ్, బిజెపి కార్యదర్శి నగేష్, 1వ మండలం అధ్యక్షురాలు మనోహరి, తదితరులు పార్టీ ఘన చరితను కొనియాడారు.

## మలబార్, తనిష్క్, జోయాలుక్కాస్‌లో 22 క్యారెట్ల బంగారం ధర..



మన గళం : బంగారం ధరలు ఇటీవలి కాలంలో భారీగా పెరుగుతున్నాయి. అధిక సుంకాల అనిశ్చితులు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాల వంటి ప్రధాన కారణాలతో బంగారం రేట్లు రికార్డ్ స్థాయిలో దూసుకెళ్తున్నాయి. భారతీయుల విషయానికి వస్తే బంగంరా అంటే కేవలం ఒక పెట్టుబడి మార్గమో, ఒక ఖనిజమో కాదు అంతకు మించి. భారతీయుల సంస్కృతి, సాంప్రదాయాలు, ఉత్సవాలకు బంగారానికి విడదీయరాని బంధం ఉంది. బంగారం ఒక వ్యక్తి సామర్థ్యాన్ని, ఆర్థిక స్థితిని సూచిస్తుంది. దీపావళి, అక్షయ తృతీయ, పెళ్లిళ్లు, కుటుంబ ఉత్సవాల వంటి ప్రత్యేక కార్యక్రమాల్లో బంగారం ఉపయోగిస్తారు. మహిళలు ఆభరణాలుగా ధరిస్తారు. దీంతో మన దేశంలో బంగారానికి ఎప్పుడూ ఫుల్ డిమాండ్ ఉంటుంది. ఏడాది పొడవునా కొంటూనే ఉంటారు. అయితే, ఇప్పుడు బంగారం ధరలు భారీగా పెరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రముఖ జువెలరీ బ్రాండ్స్‌లో సెప్టెంబర్ 8, 2025వ తేదీన 22 క్యారెట్ల బంగారం (ఆభరణాల తయారీ గోల్డ్ ధర) రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. అయితే, ఈ కథనంలో సూచిస్తోన్న నగల తయారీ బంగారం ధరల్లో ఎలాంటి జీఎస్టీ, మేకింగ్ ఛార్జీల వంటివి కలపడం లేదు. ప్రాంతాలను బట్టి పన్నులు, ఛార్జీలు మారుతుంటాయని గమనించాలి. తనిష్క్ జువెలరీలో సెప్టెంబర్ 8, 2025 సోమవారం రోజున సాయంత్రం 5 గంటల ప్రాంతంలో 22 క్యారెట్ల బంగారు నగలకు తులం రేటు రూ. 99,750 వద్ద ఉంది. మలబాహ్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో ఇవాళ 22 క్యారెట్ల బంగారం ఆభరణాల రేటు తులానికి రూ. 99,850 వద్ద ఉంది. జోయాలుక్కాస్‌లో సెప్టెంబర్ 8వ తేదీన సాయంత్రం బంగారం ధరలు చూస్తే 22 క్యారెట్ల బంగారు నగలు తులానికి రూ. 99,850 వద్ద ఉంది. ముంబై, బెంగళూరు, ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి ఆన్‌లైన్ స్టోర్స్‌లోనూ ఇదే ధర ఉంది. కల్యాణ్ జువెలర్స్‌లో సోమవారం రోజు సాయంత్రం ఆభరణాల బంగారం (22 క్యారెట్లు) తులానికి రూ. 99,850 వద్ద ఉంది. ముంబై, ఢిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్ వంటి ప్రాంతాల్లోనూ ఇదే ధర చూపిస్తోంది.

## ఆ బెనిఫిట్స్ ఏం లేవ్.. జీఎస్టీ తగ్గింపుపై బాంబు పేల్చిన ట్యాక్స్ విభాగం




మన గళం : వస్తు సేవల పన్ను జీఎస్టీలో మార్పులు సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. జీఎస్టీ 2.0లో కేవలం రెండు పన్ను శ్లాబులు 5, 18 శాతం ఉంటాయి. 12, 28 శ్లాబులను తొలగించారు. దీంతో చాలా రకాల వస్తువులు, సేవలపై పన్నుల భారం తగ్గి ప్రజలకు ప్రయోజనాలు అందనున్నాయి. ఈ క్రమంలోనే జీఎస్టీ కొత్త రూల్స్ గురించి చాలా రకాలుగా సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో ఓ వైరల్ పోస్టుపై కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ విభాగం క్లారిటీ ఇచ్చింది. సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అమలులోకి వస్తోన్న జీఎస్టీ కొత్త రూల్స్ కింద కొత్త ట్రాన్సిషన్ బెనిఫిట్స్ ఉంటాయన్న ప్రచారాన్ని ఖండించింది. అలాంటి బెనిఫిట్స్ ఏం లేవని తేల్చేసింది. ఈ మేరకు ఆ ప్రకటన జారీ చేసింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్, కస్టమ్స్ విభాగం (సీబీఐసీ) ఛైర్మన్ ఓ ప్రకటన చేశారంటూ సోషల్ మీడియాలో జీఎస్టీ బెనిఫిట్స్‌కి సంబంధించి ఓ పోస్ట్ సర్క్యులేట్ అవుతోంది. జీఎస్టీ మార్పుల ద్వారా చాలా రకాల బెనిఫిట్స్ ఉంటాయని, ప్రధానంగా యుటిలైజ్డ్ సెస్ క్రెడిట్, మినహాయింపు ఉన్న సరఫరాల ఐటీసీ వంటివి ఉంటాయని ఆ పోస్టులో రాసుకొచ్చినట్లు సీబీఐసీ తెలిపింది. సెప్టెంబర్ 22, 2025 నుంచి ఈ కొత్త ధరల సవరణ అమలులోకి తెస్తున్నట్లు సీబీఐసీ ఛైర్మన్ జారీ చేసినట్లు పోస్ట్ పేర్కొందని, అది తప్పుడు ప్రచారమని స్పష్టం చేసింది. అలాంటి ప్రచారాలు తప్పుడు, తప్పుదారి పట్టించేవి అని తెలిపింది. సీబీఐసీ ప్రకటన ప్రకారం.. ‘ జీఎస్టీ మార్పుల ద్వారా చాలా రకాల బెనిఫిట్స్ ఉంటాయంటూ సీబీఐసీ ఛైర్మన్ జారీ చేసినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న ఓ పోస్టు మా దృష్టికి వచ్చింది. అన్‌యుటిలైజ్డ్ సెస్ క్రెడిట్, ఎగ్జెంప్టెడ్ సప్లాయిస్ ఐటీసీ, కొత్త ధరల సవరణ బెనిఫిట్స్ వంటివి అందులో క్లెయిమ్ చేశారు. అటువంటి వాదనలు వాస్తవంగా తప్పు, తప్పుదారి పట్టించేవని తెలియజేస్తున్నాం’ అని పేర్కొంది. దేశ ప్రజలు, ట్రేడ్ యూనియన్లు, ఇండస్ట్రీ కమ్యూనిటీల సభ్యులు, ఇతర భాగస్వామ్యులు ఇలాంటి వాటిని నమ్మవద్దని సూచించింది. ప్రభుత్వం అధికారికంగా జారీ చేసే నోటిఫికేషన్లు, సర్క్యులర్లు, ఎఫ్ఏక్యూలను మాత్రమే చూడాలని కోరింది. దాని ద్వారానే తదుపరి తరం జీఎస్టీ సంస్కరణల గురించి తెలుసుకోవాలని స్పష్టం చేసింది. సెప్టెంబర్ 3వ తేదీన జరిగిన జీఎస్టీ 56వ కౌన్సిల్ సమావేశంలో జీఎస్టీ సంస్కరణలకు ఆమోదం లభించింది. దీంతో దేశంలో రెండు శ్లాబుల వ్యవస్థ అమలు కాబోతోంది. 5, 18 శాతం మాత్రమే జీఎస్టీ శ్లాబులు ఉంటాయి. అయితే, సైన్ గూడ్స్, లగ్జరీ వస్తువులకు సంబంధించి 40 శాతం ట్యాక్స్ శ్లాబ్ తీసుకొస్తున్నారు. వాటి ధరలు అమాంతం పెరుగుతాయి. కానీ, చాలా వరకు నిత్యావసర వస్తువుల ధరలు దిగివస్తాయని చెప్పవచ్చు. 12, 28 శాతం శ్లాబులను పూర్తిగా తొలగించారు.

## స్వల్ప లాభాలతో ముగిసిన దేశీయ సూచీలు

మన గళం : దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభనష్టాల మధ్య తీవ్రంగా ఊగిసలాడాయి. ఉదయం భారీ లాభాలతో కళకళలాడిన సూచీలు, ట్రేడింగ్ చివరి గంటలో అమ్మకాల ఒత్తిడికి గురై నామమాత్రపు లాభాలతో ముగిశాయి. ఆటో, మెటల్ రంగ షేర్లలో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించగా, ఐటీ దిగ్గజ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడం మార్కెట్లను కిందకు లాగింది.ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 76.54 పాయింట్లు లాభపడి 80,787.30 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 32.15 పాయింట్లు పెరిగి 24,773.15 వద్ద ముగిసింది. జీఎస్టీ సంస్కరణల ప్రకటన, ఆటోమొబైల్ కంపెనీలు వడ్డీ రేట్లను తగ్గించడం వంటి సానుకూల అంశాలతో ఉదయం సెషన్ ఆరంభంలో సెన్సెక్స్ ఏకంగా 400 పాయింట్లకు పైగా ఎగబాకి, రోజులో 81,171.38 గరిష్ఠ స్థాయిని తాకింది. అయితే, చివరి గంటలో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో ఆ లాభాలన్నీ దాదాపుగా ఆవిరయ్యాయి.”తగ్గినప్పుడు కొనుగోలు, పెరిగినప్పుడు అమ్మకాలు అనే వ్యూహాన్ని మదుపరులు అనుసరిస్తున్నారని, మార్కెట్ ఆరంభ లాభాలను నిలబెట్టుకోలేకపోవడానికి ఇదే కారణం” అని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ విశ్లేషించారు. జీఎస్టీ రేట్ల తగ్గింపుతో డిమాండ్ పెరుగుతుందన్న అంచనాలతో ఆటో షేర్లు ర్యాలీ చేశాయని, అయితే అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల కారణంగా ఐటీ రంగం బలహీనంగా ఉందని ఆయన తెలిపారు.సెన్సెక్స్ షేర్లలో టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రధానంగా లాభపడ్డాయి. మరోవైపు, ట్రెంట్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్, టీసీఎస్, సన్ ఫార్మా నష్టపోయిన వాటిలో ఉన్నాయి.


Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310